క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య పనులు తప్పనిసరి

సీతానగరం: మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాల్సిందేనని ఈఓపీఆర్‌డీ కె. కుమారవర్మ అన్నారు. కోట సీతారాంపురం, రంగంపేట, పణుకుపేట, పీబీ పేట, దయానిధిపురం గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యదర్శులు చేపడుతున్న పారిశుధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... గ్రీన అంబాసిడర్లకు ట్రై సైకిళ్లు అందజేశామని, ప్రజలు తమ ఇంటి చెత్తను తడి, పొడిగా విభజించి వారికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కోట సీతారాంపురం కార్యదర్శి కామేశ్వరరావు, వార్డు సభ్యులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం

గరుగుబిల్లి: మండల కేంద్రంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఆదివారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి అశోక్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.శంకరరావు, పి.గౌరునాయుడు, కె.నర్సింగరావు, వి.సరస్వతమ్మ, రమణ, సురేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా విద్యార్థుల సంఖ్య పెరిగేనా..?

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రతి ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న ఈ వసతిగృహంలో విద్యార్థుల ఆలనాపాలనా చూసేందుకు రెగ్యులర్ వార్డెన్ కూడా లేకపోవడంతో విద్యార్థి చదువులు అటకెక్కిపోతున్నాయి. వార్డెన్ లేకపోవడంతో 2024 – 25 విద్యా సంవత్సరంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఒక్కరు కూడా జాయిన్ కాలేదు. ప్రస్తుతం 16 మంది గిరిజన విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. గరుగుబిల్లి మండలం రావివలస సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహం వార్డెన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. రాత్రి పూట విద్యార్థులను పర్యవేక్షించేందుకు ఎవరూ లేకపోవడంతో తమ చిన్నారులను హాస్టల్‌లో జాయిన్ చేసేందుకు తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. జూన్ నుంచి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థుల సంఖ్య పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మంచినీటి పథకాలకు శంకు స్థాపన

సీతంపేట: మండలంలోని పలు మంచినీటి పథకాలకు ఆదివారం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేశారు. దుగ్గి గ్రామంలో పీఎం జన్‌మన్ పథకం ద్వారా రూ.8 లక్షల అంచనా వ్యయంతో 10 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత పథకాన్ని ప్రారంభించారు. అలాగే కారెంకొత్తగూడ, బిల్లగూడకాలనీ, రోలుగిడ్డి, గౌరీపురం, చాకలిగూడ తదితర గ్రామాల్లో మంచినీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు, ఏఈ సత్యం తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ విజేత పోలీస్ జట్టు




పోలీస్ జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తున్న మాజీ ఎంపీ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం సింగుపురం గ్రామంలో జాకారమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో గత 20 రోజులుగా జరిగిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా పోలీస్ జట్టు నిలిచింది. ఈ మేరకు ఈ టోర్నీకి పరిసర గ్రామాల నుంచి 70 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌కు గుమ్మలక్ష్మీపురం మండలం బెల్లిడి జట్టుతో పాటు ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలోని పోలీసుల టీం కూడా చేరింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెల్లిడి జట్టు 15 ఓవర్లకు 122 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఎల్విన్‌పేట సీఐ బి.హరి సారథ్యంలో బ్యాటింగ్‌కు దిగిన పోలీసుల జట్టు చివరి ఓవర్లో 20 పరుగులు చేపట్టాల్సి ఉండగా.. పోలీసుల జట్టు ఆ ఓవర్లో 3 సిక్స్‌లు, రెండు సింగల్స్ తీసి విజేతగా నిలిచింది. రసవత్తరంగా సాగిన ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన పోలీసుల జట్టుకు నిర్వాహకులు సమకూర్చిన రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీని మాజీ పార్లమెంటు సభ్యులు వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ అందజేశారు. అనంతరం రన్నర్స్‌గా నిలిచిన బెల్లిడి జట్టుకు రూ.10వేల నగదుతో పాటు ట్రోఫీని ఎల్విన్‌పేట సీఐ బి.హరి అందజేశారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఈ నెల 7వ తేదీ నుంచి ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర సంక్షేమ శాఖల కళాశాలలతో పాటు హైస్కూల్ ప్లస్ కళాశాలలన్నీ కలిపి మొత్తం 203 కళాశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారంతా తమకు నచ్చిన కళాశాలకు వెళ్లి, నేరుగా దరఖాస్తు చేసుకుని కోర్సులో చేరవచ్చు. ఈ కొత్త విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలు చేసి, ఇంటర్మీడియట్‌లో కొత్తగా ఎంబైపీసీ(మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ)ని అందుబాటులోకి తీసుకువచ్చారు.



పార్వతీపురంటౌన్: సీతారామస్వామి ఆలయంలో స్వామి వారు



పార్వతీపురంటౌన్: శ్రీరాముని పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు



సాలూరు: వెలమపేటలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మక్కువ: కన్నంపేట గ్రామంలో శ్రీరాముడిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర



సీతానగరం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు పవన్‌కుమార్, శ్రీనివాసాచార్యులు

జగదానందకారకా..

సీతారాముల కల్యాణం వాడవాడలా కనుల పండువగా ఆదివారం నిర్వహించారు. పల్లెలు, పట్టాణాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతం జై శ్రీరామ్ నినాదంతో హోరెత్తింది. ప్రతి ఏటా వసంతరుతువులో చైత్రశుద్ధ నవమి నాడు స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే రోజు స్వామి పుట్టిన రోజు కావడం కూడా విశేషం. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా భక్తులందరూ వేకువజామునే లేచి స్వామి దర్శనానికి రామ మందిరాలు, ఆలయాలు, మంటపాల్లో బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, పానకం, ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిర్వహించిన కల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– పార్వతీపురం/ సాలూరు నెట్‌వర్క్



పార్వతీపురం రూరల్: ఎమ్మార్‌నగరంలో ఉత్సవ మూర్తులు



బలిజిపేట గొల్లవీధి రామాలయంలో పూజలు అందుకుంటున్న స్వామివారు



పార్వతీపురంటౌన్: వైకేఎం రామాలయంలో స్వామి



సీతానగరం: కృష్ణారాయపురం రామమందిరం ఆవరణలో పూజలో పాల్గొన్న భక్తులు



సాలూరు రూరల్: మామిడిపల్లిలో శ్రీరామ నవమి వేడుకలు



మక్కువ: రామిరెడ్డి వీధిలో శ్రీరాముడిని దర్శించుకున్న మావుడి రంగునాయుడు



పార్వతీపురం రూరల్: కృష్ణపల్లిలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



పార్వతీపురం రూరల్: సంగంవలసలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



పార్వతీపురంటౌన్: వేమకోటి వారి వీధిలో కల్యాణం నిర్వహిస్తున్న మురపార కాళిదాసు యాజీ

చెలమల నీరే గతి..

- గిరిశిఖర గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- కలుషిత నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్న గిరిజనులు

సాలూరు:

వేసవి వచ్చిందంటే చాలు గిరిజన గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తుంటాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో గ్రామాల్లో తాగునీరు దొరకని పరిస్థితి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొండల మధ్య నుంచి ప్రవహించే చెలమల నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొంది. అడవిలో రాలిన ఆకులు, అలములు, మృత కళేబరాలు, ఇతర వ్యర్థాల మీదుగా వచ్చే కలుషిత నీటిని తాగుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. మూగజీవాల దప్పిక కూడా ఈ నీరే తీరుస్తుంది. నియోజకవర్గంలోని పలు గిరిశిఖర గ్రామాల్లో ప్రస్తుతం తాగునీటి ఎద్దడి నెలకొంది. నియోజకవర్గంలో ఒక్క పాచిపెంట మండలంలోని మిళియకంచూరు పంచాయతీలో ములగపాడు, కందివలస, కాకులమడ గ్రామాలను పరిశీలిస్తే ప్రజలు తాగునీటికి పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ సమీపంలో వచ్చే చెలమల నీటిని మహిళలు, చిన్నారులకు గంటల తరబడి శ్రమించి పడుతుంటారు. ఈ నీటిని ఇళ్లకు తీసుకెళ్లి వడబోసి తాగుతుంటారు. నీరు కలుషితం కావడంతో ఎప్పటికప్పుడు అంటురోగాలు ప్రబలుతున్నాయి ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ములగపాడులో ఈ మధ్య కాలంలో నలుగురు వ్యక్తులు పాడి శ్రీరామ్, పాడి లచ్చయ్య, వెంకటి, లచ్చమ్మలు అనారోగ్యాలతో మరణించారు.



ములగపాడులో చెలమల నుంచి నీటిని తోడుకుంటున్న మహిళలు

అలాగే గ్రామానికి చెందిన మరికొంతమంది మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. తుమరావల్లి పంచాయతీలో సిమిడివలస.. కేరంగి పంచాయతీ వెంకుమామిడివలస, తదితర గ్రామాల ప్రజలు కూడా ఈ వేసవిలో ఊటనీటి మీదే ఆధారపడుతున్నారు. ఐటీడీఏ ప్రాంత అభివృద్ధికి నిధులు అందుబాటులో ఉన్నా తమకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల మైదాన ప్రాంతమైన గురువినాయుడుపేట పంచాయతీ గొలుగువలస మహిళలు తాగునీటి సమస్యపై మంత్రి సంధ్యారాణిని అడ్డుకున్న విషయం తెలిసిందే. కలెక్టర్, ఐటీడీఏ పీఓ, తదితరులు గ్రామాల్లో సందర్శించి, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరపుత్రులు కోరుతున్నారు.



కందివలసలో రాళ్ల మధ్య నుంచి వస్తున్న ఊట నీటిని ఒడిసిపడుతున్న మహిళలు

అన్న సమారాధన..



పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి దాదాపు 2 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ప్రతి ఏటా శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

– పార్వతీపురం రూరల్

నువ్వు సాగుకు అదును ఇదే..



సీతానగరం మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మాగాణి భూముల్లో తొలకరి నువ్వు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. ఈ నెల 3,4 తేదీల్లో వర్షాలు కురవడంతో రైతులు దుక్కులు చేపడుతున్నారు. మండలంలోని జోగింపేట, అంటిపేట, బూర్జ, కాశీపేట, వెంకటాపురం, నీలకంఠాపురం, నిడగల్లు, తామరఖండి, గెడ్డలుప్పి గ్రామాల రైతులు నువ్వు సాగుకు సమాయత్తమవుతున్నారు.

– సీతానగరం

న్యాయం చేయండి..



రెల్లి, ఉప కులాలకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఇందిరా కాలనీ కూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రెల్లి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మన్యం జిల్లా రెల్లి కులాల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన జస్టిస్ రంజన్ మిశ్రా కమిషన్ రెల్లి, వాటి ఉపకులాలకు ఒక్కశాతం రిజర్వేషన్ కేటాయించడం విచారకరమన్నారు. రాష్ట్రం మొత్తం మీద 25 లక్షల మందికి పైగా రెల్లి, ఉపకులాల వారు ఉండగా.. కేవలం రెండు లక్షల మందే ఉన్నారని చెప్పడం సరికాదన్నారు.

– పార్వతీపురం టౌన్

వక్ఫ్ సవరణ బిల్లును బలపరచడం అన్యాయం

సాలూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతివ్వడం సరికాదని ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు షేక్ ఇమామ్ బాషా, షేక్ ఇక్బాల్, షేక్ బాజీ, షేక్ సభాన్, షేక్ బకారి, షేక్ రాజా, షేక్ పాన్‌బాషా, తదితరులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని 25, 29, 30 నిబంధనలను తుంగలో తొక్కేలా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం తీసుకువచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్ట సవరణ వల్ల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముస్లిం సంఘాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ముస్లింలకు అన్యాయం చేస్తే ఆందోళన చేపట్టక తప్పదన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం సంఘ నాయకులు

ముస్లింల నిరసనకు పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకుడు ఎన్‌వై నాయుడు సంఘీభావం ప్రకటించారు.

రామాలయం నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం శివన్నపేట రామాలయంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో మాజీ పార్లమెంట్ సభ్యులు వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆయన రామాలయం నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే కురుపాం మండలం ఉదయపురం పంచాయతీ కాకితాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సందర్శించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

పాలకొండ: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. పాలకొండ పట్టణంలో స్థానిక ఎమ్మె ల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల కల్పతరువు తోటపల్లి కాలువల ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రూ.37 కోట్లతో పూడికలు తీత చేపడుతున్నామని వివరించారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి ఖరీఫ్‌లో ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామని తెలిపారు. అమరావతి, పోలవరం పూర్తి చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నియోజకవర్గ కూటమి నాయకులు ఉన్నారు.

ముగిసిన వసంత నవరాత్రి దీక్షలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం కోటలో వెలిసిన హనుమత్ సీతాలక్ష్మణ భరత శతృఘ్న సమేత శ్రీరామచంద్రమూర్తికి వసంత నవరాత్రులు సందర్భంగా(ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు) శాస్త్రోక్తంగా వేద పండితుల ఆధ్వర్యంలో ఆదివారం వసంత నవరాత్రి దీక్షను మాజీ కేంద్ర మంత్రి కిశోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పారాయణం, రామ రహస్యోపనిషత్, నారాయణోపనిషత్, పంచసూక్త, పంచ ఉపనిషత్ పారాయణాలు, సుందరకాండ పారాయణం గావించారు. 1116 రుద్రాక్షలతో చేసిన శివలింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కిశోర్ చంద్రదేవ్ మాట్లాడుతూ లోకకల్యాణార్థం విశ్వశాంతే లక్ష్యంగా.. ఈ కార్యక్రమం గత రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.



కోటలో వసంత నవరాత్రి దీక్షలో భాగంగా హోమం చేపడుతున్న కిశోర్ చంద్రసూర్యనారాయణ దేవ్

ఉత్కంఠగా వాలీబాల్ టోర్నీ

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా వీటిని నిర్వహించారు. 15 జట్లకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఎంతో ఉత్కంఠగా సాగిన పోటీల్లో తంపటాపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. తుమరాడ జట్టు ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ రాకోటి రాములు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. గెలుపొందిన క్రీడాకారులకు అంబేడ్కర్ జయంతి రోజున తుమరాడలో జరగనున్న కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు, ఉప సర్పంచ ఆర్.వెంకటరమణ తెలిపారు.

సిరిమాను చెట్టు తరలింపు

బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లిలో దాడితల్లి సిరిమానోత్సవానికి సంబంధించి, సిరిమాను తయారీకి కృష్ణాపురంలో గుర్తించిన సిరిమాను చెట్టును గ్రామానికి ఆదివారం తరలించారు. మే 4, 5, 6వ తేదీల్లో దాడితల్లి అమ్మవారి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మే 5వ తేదీన జరిగే సిరిమానోత్సవానికి సిరిమాను తయారు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మండల జనార్థనరావు, వి.రవికుమార్, సాయిహేమంత్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.